మెట్రో ఈవెనింగ్స్

RNI No.68319/98

BREAKING EDITION

Estd : 1998

2 PM

April 11,2026
Saturday

Hyderabad

Vol:28, Issue:263




## డీల్ కుదరకుంటే
# భీకర యుద్ధమే


### అత్యుత్తమ ఆయుధాలు సిద్ధం చేశాం
### చర్చలకు కొద్ది గంటల ముందు ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

ఇంటర్నెట్ డెస్క్: ఫిబ్రవరి 28న అమెరికా– ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య మొదలైన యుద్ధం ప్రభావం ప్రపంచ మొత్తం పడింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఇంధన సంక్షోభానికి కారణమైంది. 40 రోజులు సాగిన ఈ యుద్ధాన్ని ముగించడానికి చేసిన ప్రయత్నాలు కొంతమేర ఫలించాయి. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్, అమెరికాలు రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాయి. శాంతి చర్చలకు ఇస్లామాబాద్ ఆతిథ్యం ఇస్తోంది. దీంతో ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ హెచ్చరికలు చేశారు.

పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇస్లామాబాద్ వేదికగా అమెరికా, ఇరాన్‌ల మధ్య ప్రత్యక్ష చర్చలు జరగనున్నాయి. ఈ చర్చలకు కొన్ని గంటల ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి బెదిరింపులకు దిగారు. ఒప్పందం కుదరకపోతే మరిన్ని దాడులు చేస్తామని ఆయన హెచ్చరించారు. న్యూయార్క్ పోస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. చర్చలు విఫలమైతే అమెరికా ఆయుధాలను చాలా సమర్ధవంతంగా ఉపయోగిస్తుందని హెచ్చరించారు. "మేము పునఃప్రారంభిస్తున్నాం…నౌకలలో అత్యుత్తమమైన మందుగుండు సామగ్రిని, ఇప్పటివరకు తయారు చేసిన అత్యుత్తమ ఆయుధాలను నింపుతున్నాం.. గతంలో మేము ఉపయోగించిన వాటి కంటే కూడా మెరుగైనవి. వాటితోనే మేము వాటిని పేల్చివేశాం.. ఒకవేళ మన మధ్య ఒప్పందం కుదరకపోతే, మేము వాటిని ఉపయోగిస్తాం.." అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇక, అమెరికా తరపున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లు పాల్గొంటున్నారు. కానీ, ఇరాన్ తరఫున ఎవరు చర్చల్లో పాల్గొంటారనేది ఇంకా స్పష్టత లేకపోవడం గమనార్హం.

ఇదిలా ఉండగా, పాకిస్థాన్‌లో జరుగుతున్న ఈ చర్చలపై అనిశ్చితి నెలకొంది. ఇరాన్ నుంచి మధ్యవర్తుల రాకపై ఇంకా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని సరిగ్గా అమలు చేయడంలో విఫలమయ్యారని ఇరుపలు ఒకరిపై ఒకరు ఆరోపించుకుంటున్నాయి. ఒప్పందం ప్రకారం తిరిగి తెరవాల్సిన హార్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ వ్యవహరించిన తీరుపై డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులపై టెహ్రాన్ తీవ్రంగా స్పందిస్తూ.. అది కూడా ఒప్పందం పరిధిలోకి వస్తుందని నొక్కి చెబుతోంది.

### ఇంటర్ ఫలితాలు రేపే
## విడుదల చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు ఆదివారం వెలువడనున్నాయి. ఈ నెల 12వ తేదీన ఇంటర్మీడియెట్ ఫలితాలను విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఫలితాలను విడుదల చేసే అవకాశాలున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులకు అల్పాహారం పథకం, మధ్యాహ్నం భోజన పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో సీఎం చేతుల మీదుగానే ఫలితాలను విడుదల చేయించే ఆలోచనలో ఇంటర్మీడియెట్ బోర్డు ఉంది. విద్యా శాఖ మంత్రి కూడా ముఖ్యమంత్రే కావడం తెల్సిందే. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరయ్యారు.

## 'అందరికీ రుణ మాఫీ చేశాం'

హైదరాబాద్ (మెట్రో న్యూస్): గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన రైతు రుణమాఫీ కేవలం వడ్డీలకే సరిపోయిందని, తమ ప్రభుత్వం మాత్రం చిత్తశుద్ధితో రైతులకు లబ్ధి చేకూరుస్తోందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన… రుణమాఫీ, రైతు భరోసా అంశాలపై మాజీ మంత్రి హరీశ్ రావు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల మంది రైతులకు, ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున రుణమాఫీని విజయవంతంగా పూర్తి చేశామని ఆయన వివరించారు.

## ఘనంగా మహాత్మా జ్యోతిబాఫూలే జయంతి

### ఢిల్లీలో నివాళులు అర్పించిన సీఎం
### పూలేను స్మరించుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
### పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు




హైదరాబాద్ (మెట్రో న్యూస్): 19వ శతాబ్దపు గొప్ప భారతీయ సామాజిక సంస్కర్త, విద్యావేత్త మరియు మహిళలు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతిని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు, ప్రతిపక్ష పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఫూలే జయంతి వేడుకలు జరిగాయి. కూడళ్లు, కార్యాలయాలలో వేడుకలు నిర్వహించి ఫూలే పోరాటాలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోని తన నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి నివాసంలో ఫూలేకు నివాళులు అర్పించారు.



## సింగర్ మంగ్లీపై క్రిమినల్ కేసు..

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలుగు రా(ష్ట్రాల్లో తన జానపద, సినీ గీతాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ గాయని మంగ్లీ తీవ్రమైన ఆరోపణలతో చిక్కుల్లో పడ్డారు. పెట్టుబడుల పేరుతో మోసం చేయడమే కాకుండా బాధితుల తరపున ప్రశ్నించిన న్యాయవాదిని చంపేస్తామని బెదిరించారనే ఆరోపణలపై పంజాగుట్ట పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో మంగ్లీతో పాటు ఆమె సోదరుడు శివ, విరాటపర్వం ఫేమ్ డైరెక్టర్ వేణు ఉడుగుల పేర్లు కూడా ఉండటం సినీ వర్గాల్లో కలకలం రేపుతోంది.

## బీసీ ఉపకోటా కోసం పోరాటం

హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఫూలే మళ్లీ పుట్టాడా అనే స్థాయిలో జాగృతి బీసీల కోసం పని చేస్తుందని కల్వకుంట్ల కవిత ప్రకటించారు. మహిళ రిజర్వేషన్ల బిల్లులో బీసీ ఉపకోటా లేకపోవటమంటే పాలకులకు భయం లేనట్లేనని, బీసీ ఉప కోటా కోసం కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా ఉద్యమం చేద్దాం అని పిలుపునిచ్చారు. బీసీ ఉపకోటా వచ్చే వరకు కూడా జాగృతి పోరాటం కొనసాగిస్తుందన్నారు. శనివారం జాగృతి కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆమె ఘనంగా నివాళులు అర్పించారు. మహాత్మా ఫూలే విగ్రహ ఏర్పాటులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు.




## అమీన్‌పూర్‌లో హైడ్రా కొరడా




ఆరంతస్తుల భవనం కూల్చివేసిన హైడ్రా..

హైదరాబాద్ (మెట్రో న్యూస్): హైదరాబాద్ శివారులోని ప్రభుత్వ భూములను కాపాడేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హైడ్రా) మరోసారి రంగంలోకి దిగింది. శనివారం ఉదయం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో భారీ కూల్చివేతలకు శ్రీకారం చుట్టింది. సుమారు 2,000 మంది రెవెన్యూ, హైడ్రా సిబ్బంది, 1,000 మందికి పైగా పోలీసుల బందోబస్తు మధ్య ఈ మెగా ఆపరేషన్ కొనసాగుతోంది. ఐలాపూర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఆరు అంతస్తుల భవనాన్ని అధికారులు భారీ యంత్రాలతో నేలమట్టం చేశారు. దీనితో పాటు 1998 నుంచి కోర్టు స్టే ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన న్యాయవాది ముఖీంకు చెందిన గెస్ట్ హౌస్‌ను కూడా అధికారులు కూల్చివేశారు. ఈ ఆపరేషన్‌తో కబ్జాదారుల గుండెల్లో వణుకు పుట్టింది. మరోవైపు, కిష్టారెడ్డిపేటలోని కేఏ రెసిడెన్సీ, క్రిస్టల్ డెవలపర్స్ భవనాల్లో నివసిస్తున్న 45 కుటుంబాలను అధికారులు ఖాళీ చేయించారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తమను బలవంతంగా బయటకు పంపుతున్నారని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు.

## క్షేమంగా తిరిగొచ్చిన వ్యోమగాములు

### ఆర్టెమిస్ బృందానికి ట్రంప్ కంగ్రాట్స్

ఇంటర్నెట్ డెస్క్: ఆర్టెమిస్–2లో చంద్రుడిని చుట్టివచ్చిన వ్యోమగాములు ఇవాళ సురక్షితంగా భూమికి చేరుకున్నారు. 9 రోజుల జర్నీ అత్యంత విజయవంతంగా సాగింది. పసిఫిక్ మహా సముద్రంలో ఓరియన్ క్యాప్సూల్ దిగింది. తమ బృందం ఆరోగ్యవంతంగా ఉన్నట్లు కమాండర్ రీడ్ వైజ్‌మాన్ తెలిపారు. ఆర్టెమిస్ సిబ్బంది భూమికి చేరుకున్న నేపథ్యంలో నాసా రియాక్ట్ అయ్యింది. మానవ అంతరిక్ష పరిశోధనలో ఇప్పుడో కొత్త అధ్యాయం ప్రారంభమైనట్లు పేర్కొన్నది. ఆర్టెమిస్‌లో ప్రయాణించిన నలుగురు వ్యోమగాములు చాలా ఆరోగ్యవంతంగా ఉన్నట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. పసిఫిక్ సముద్రంలో దిగిన తర్వాత.. ఆ వ్యోమగాముల్ని అమెరికా నౌకలోకి తీసుకెళ్లారు. భూవాతావరణంలోకి ప్రవేశిస్తున్న సమయంలో ఆర్టెమిస్ సుమారు ఆరు నిమిషాల పాటు బ్లాకౌట్ ఎదుర్కొన్నది. ఏప్రిల్ ఒకటో తేదీన ఆర్టెమిస్ నింగికి ఎగిరింది. వ్యోమగాములు సుమారు 406,771 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వచ్చారు. ఆర్టెమిస్ వ్యోమగాములకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కంగ్రాట్స్ తెలిపారు. ట్రుత్ సోషల్‌లో ఆయన స్పందించారు.

